

పల్లె ప్రగతిలో ముందంజ

పల్లెల అభివృద్ధిలో దేశంలోనే రాష్ట్రం,జిల్లా ముందంజలో నిలుస్తున్నాయని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. 8లో




కమ్యూనిస్టులు ఉన్న వైపే..

కమ్యూనిస్టులు ఎవరి పక్షాన ఉంటే వారే విజయం సాధిస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 23°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత పెరుగుతుంది.



న్యూస్‌రీల్

ఉత్సవమూర్తులకు కల్యాణ అలంకరణ



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులతో అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం నాలుగు రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీవారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకం చేశాక, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో కల్యాణోత్సవానికి ముస్తాబు చేశారు. అనంతరం నిత్య కల్యాణాన్ని అర్చకులు కురవి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిర్వహించగా, ఉత్సవ మూర్తులను గజవాహనంపై గిరిప్రదక్షిణ చేయించారు. ఈఓ కె.జగన్మోహన్‌రావు, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి, అర్చకులు ఉప్పల విజయదేవ శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ముమ్మరంగా గస్తీ

- పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ వారియర్

కూసుమంచి: రాత్రి వేళ గస్తీ ముమ్మరం చేయడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట పడుతుందని పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. కూసుమంచి పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. అలాగే, ఫిర్యాదుల నమోదు, పెండింగ్ కేసులు, విచారణ, ఫంక్షనల్ వర్టికల్స్‌పై సమీక్షించారు. సిబ్బంది అత్యవసర సమయాల్లో విధులకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉండాలని, అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. పాత నేరస్తుల నివాసాలు, వారి కదలికలను గుర్తించేలా చేస్తున్న జియో ట్యాగింగ్‌ను ఆన్‌లైన్‌లో సీపీ పరిశీలించారు. ఈ తనిఖీల్లో సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సమానత్వం ఇంటి నుంచే రావాలి..

ఖమ్మంలీగల్: ఆడ, మగ సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ భ్రూణ హత్యల వ్యతిరేక దినం సందర్భంగా శనివారం పారా లీగల్ వలంటీర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయసేవాసంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సదస్సులో జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతిలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని గుర్తించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్ల కంటే మగపిల్ల లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండడం సరికాదన్నారు. ఆడబిడ్డ పుడితే కట్నం ఇవ్వాల్సి వస్తుందని భయంతో భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని.. అందుకోసం వరకట్నాన్ని రూపుమాపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయసేవాసంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావీద్ పాషా, న్యాయవాదులు పాల్గొన్నారు.

28న జెడ్పీ సమావేశం



ఖమ్మం సహకారనగర్: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు సీఈఓ వీ.వీ.అప్పారావు తెలిపారు. ఈనెల 28న ఉదయం 10గంటలకు జెడ్పీ హాల్‌లో చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన సమావేశం మొదలవుతుందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలపై చర్చ జరగనున్న ఈ సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

అతివేగం, నిర్లక్ష్యంతో ప్రాణాలు బలి

- రోడ్డు ప్రమాదాల్లో ముగిసిపోతున్న జీవితాలు
- జిల్లాలో గత మూడు నెలల్లో 50మంది మృతి
- మొన్న ఇద్దరు యువకులు.. నిన్న దంపతుల కన్నుమూత





వైరాలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన దంపతులు

రుధిర దారులు

జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన ప్రమాదంలో ముదిగొండ మండలానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. అతివేగంతో వెళ్లకపోతే వీరు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడే వారు. వైరాలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు కన్నుమూశారు. వీరిలో ద్విచక్ర వాహనం నడుపుతున్న భర్తకు హెల్మెట్ ఉన్నా ధరించలేదు. ఒకవేళ హెల్మెట్ పెట్టుకుని ఉంటే ఒకరైనా బతికి ఉండే వారనే చర్చ జరుగుతోంది. ఇలా జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా.. విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

ఖమ్మంక్రైం: అతివేగం, నిర్లక్ష్యం, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న కొందరు నిండు ప్రాణాలను కోల్పోవడమే కాక ఇతరుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నారు. అర్ధరాత్రి వరకు పుట్టిన రోజు వేడుకలు, మద్యం తాగడం అంటూ తిరిగే కొందరు అతివేగంతో వాహనాలు నడుపుతుండడంతో అదుపు తప్పి కన్నుమూస్తున్నారు. తాజాగా ఖమ్మం చర్చి కాంపౌండ్ వద్ద జరిగిన ప్రమాదానికి కూడా అతివేగమే కారణమని తెలుస్తోంది.

రోడ్లపై విచ్చలవిడిగా..

ఇటీవల యువత రోడ్లపై విచ్చలవిడిగా వాహనాలు నడుపుతున్నారు. మద్యం సేవించి ట్రిపుల్ డ్రైవ్ చేస్తూ ప్రమాదాల బారిన పడడం పరిపాటిగా మారింది. మారుతున్న కాలానికనుగుణంగా మార్కెట్‌లోకి వస్తున్న బైక్‌లను యువకులపై ప్రేమతో తల్లిదండ్రులు కొనిస్తుండడంతో వీరు అతివేగంగా వెళ్తూ ఇబ్బందుల బారిన పడుతున్నారు. వేగంగా వెళ్లే క్రమంలో మూలమలుపుల వద్ద, ఎదురుగా వాహనాలు వచ్చిన సమయాన ద్విచక్ర వాహనాన్ని నిలువరించలేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. దీనికి తోడు హెల్మెట్ ధరించకపోవడం ప్రమాద తీవ్రతను పెంచుతోంది.

మూడు నెలల్లో 50మంది మృతి

జిల్లాలో గత మూడు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 50మంది మృతి చెందారు. ఇక సుమారు 150మందికి పైగానే గాయాల పాలయ్యారు. గత ఏడాది ప్రమాదాల్లో 200 మంది మృతి చెందగా, 700మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఇలాంటి ఘటనలు విన్నప్పుడల్లా బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చే వరకు ఎదురుచూడడం కుటుంబ సభ్యులకు అలవాటుగా మారింది. కాగా, రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతుండగా వారి కుటుంబీకులు దిక్కులేని వారవుతున్నారు.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు..



యువత వాహనాలను అతివేగంగా నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఇటీవల ఖమ్మంలో ట్రాఫిక్ పెరిగింది. ఈ విషయాన్ని గుర్తించి వాహనచోదకులు నిబంధనలు పాటించడమే కాక హెల్మెట్ ధరించాలి. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపొద్దు.

– రామోజీ రమేష్, ట్రాఫిక్ ఏసీపీ, ఖమ్మం

భద్రాద్రికి తీరని ద్రోహం చేశారు

- రూ.కోట్ల హామీలు ఏమయ్యాయి ?
- రామయ్య హుండీలో రూపాయి కూడా వేయని గొప్ప భక్తుడు కేసీఆర్..
- సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి



సమ్మేళనంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

భద్రాచలం: భద్రాద్రి రామయ్యతో పాటు ఈ నియోజకవర్గ ప్రజలకు సీఎం కేసీఆర్ అడుగడుగునా ద్రోహం చేశారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈమేరకు పొంగులేటికి బ్రిడ్జి సెంటర్ వద్ద అభిమానులు, అనుచరులు ఘనంగా స్వాగతం పలకగా, అక్కడి నుంచి కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలోకి వచ్చాక భద్రాచలంలో ఎనిమిది సార్లు శ్రీరామనవమి వేడుకలు జరిగితే ఒక్కసారే హాజరయ్యారని, భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్లు, గోదావరి వరద బాధితులకు రూ.1000 కోట్లు ప్రకటించి రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రామయ్య హుండీలో కనీసం రూపాయి కూడా వేయని గొప్ప భక్తుడని ఎద్దేవా చేశారు. దివంగత నేత వైఎస్సార్ ఇళ్లు నిర్మించి ఇస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఇప్పటికీ పూజిస్తున్నారని, ప్రజలకు అలాంటి పాలన అందించాలే తప్ప అమలు చేయని హామీలతో మోసం చేయవద్దని హితవు పలికారు. నీళ్లు, నిధులు, నియామకాలతో సాధించుకున్న తెలంగాణలో అవన్నీ కల్వకుంట్ల కుటుంబానికే చేరుతున్నాయని విమర్శించారు. కలిసి వచ్చే మిత్రులతో ముందుకు సాగుతామని, జెండా ఏదైనా సీఎం కేసీఆర్‌ను గద్దె దించడమే అజెండా అని స్పష్టం చేశారు. నాయకులు తెల్లం వెంకట్రావ్, పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవితో పాటు జారే ఆదినారాయణ, విజయాబాయి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంలో కరోనా కేసు



ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో చాన్నాళ్ల తర్వాత శనివారం కరోనా కేసు నమోదైంది. మొదటి, రెండు, మూడో వేవ్‌లు ముగిశాక మళ్లీ ఇప్పుడు కరోనా కేసు నమోదు కావడం కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి వచ్చిన వ్యక్తికి పరీక్షలు చేయగా కరోనాగా నిర్ధారణ అయింది. దీంతో స్పందించిన జిల్లా అధికారులు సమీక్షించారు. ఆస్పత్రుల్లో పరీక్షలకు ఉన్న సౌకర్యాలు, అనుమానితులు వస్తున్నారా, పరీక్షలు ఎలా జరుగుతున్నాయనే అంశంపై సమాచారం సేకరించారు.

నలుగురు డీబార్

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో శనివారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేశారు. నేలకొండపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కేంద్రంలో ఇంటర్ పరీక్షలను స్క్వాడ్ బృందాలు తనిఖీ చేయగా, వృత్తి విద్యా కోర్సుల పరీక్ష రాస్తున్న ఇద్దరు, ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్ష రాస్తున్న ఒక్కో విద్యార్థి కాపీ చేస్తున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా, శనివారం పరీక్షలకు 18,849మంది విద్యార్థుల్లో 17,907మంది హాజరు కాగా 942మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం..



సభలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ, వేదికపై ఎంపీ నామా, ఎమ్మెల్సీ మధు తదితరులు

- వామపక్షాలతో కలిసి ఉమ్మడి జిల్లాలో పది సీట్లు సాధిస్తాం
- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- మధిరలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం



బోటు షికారు చేస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామా, కలెక్టర్ గౌతమ్ తదితరులు

మధిర: రాబోయే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వాన బీఆర్‌ఎస్ విజయఢంకా మోగించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోనూ వామపక్షాలతో కలిసి పదికి పది సీట్లను గెలుచుకుంటామన్నారు. మధిరలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి స్థానిక టీవీఎం పాఠశాలలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోగా.. కేసీఆర్ స్వయంగా పరిశీలించి పంట నష్టపరిహారాన్ని ప్రకటించారని తెలిపారు. కేసీఆర్‌ను గద్దె దించుతాం అని చెబుతున్న కొందరి తీరు తల్లి పాలు తాగి రొమ్ము గుద్దిన చందంగా ఉందని పొంగులేటిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పార్టీలో ఉండి పార్టీ అభ్యర్థులను గెలిపించకుండా ద్రోహం చేశారని పేర్కొన్నారు. కాగా, ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యుడిగా మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలన డిమాండ్ చేస్తున్న బీజేపీ నేతలు.. ఆ ఘటనతో మంత్రికి ఏం సంబంధమో చెప్పాలని ప్రశ్నించారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో మరెక్కడా లేవని అన్నారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ తనకు గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ బీ ఫాం ఇచ్చారే తప్ప ఎవరి దయాదాక్షిణ్యాలతో పోటీ చేయలేదని తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ అకాల వర్షాలతో ఇక్కడి రైతులు ఇబ్బంది పడుతుంటే స్థానిక ఎమ్మెల్యే ఆదిలాబాద్‌లో పాదయాత్ర చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావు బీఆర్‌ఎస్‌లో చేరగా ఆయనకు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు మొండితోక లత, శీలం విద్యాలత, ఎంపీపీ లలిత, కౌన్సిలర్లు మల్లాది వాసు, సవిత, ధరావత్ మాధవి, బిక్కి అనిత, నాయకులు మొండితోక జయాకర్, శీలం వెంకటరెడ్డి బిక్కి కృష్ణప్రసాద్, కరివేద సుధాకర్, చిత్తారు నాగేశ్వరరావు, కనుమూరు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, ఇక్బాల్, గుర్రం రామారావు, అరిగే శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మధిర అభివృద్ధి

మధిర: మున్సిపల్ ఎన్నికల సమయాన ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మధిరను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధి అంబారుపేటలో రూ.5.70 కోట్లతో నిర్మించిన ట్యాంక్ బండ్, రూ.4.50 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్‌ను ఎంపీ నామా నాగేశ్వరరావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. అలాగే, రూ.2.08 కోట్ల ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైయిన్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నగరానికి ధీటుగా మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు కూరగాయలు, పండ్లు, మాంసాహారం ఒకే చోట లభించేలా సమీకృత మార్కెట్, ఆహ్లాదం కోసం ట్యాంక్‌బండ్ నిర్మించామని తెలిపారు. తొలుత బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి మంత్రికి స్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ రమాదేవి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, తహసీల్దార్ రాజేష్, జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి పాల్గొన్నారు.

కమ్యూనిస్టులకు ఓట్లేసే రోజులు పోయాయ్

ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: రానున్న ఎన్నికల్లో పాలేరు నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని.. గెలుపు కూడా తనదేనని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి వెల్లడించారు. కూసుమంచిలో శనివారం పాలేరు నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఇటీవల జనచైతన్య యాత్రలో సీపీఎం నాయకులు పాలేరు టికెట్ అడుగుతున్నాం అని చెప్పారు.. కానీ మీరందరూ ఒకటి గుర్తు పెట్టుకోవాలి.. కమ్యూనిస్టులకు ఓట్లువేసే రోజులు పోయాయి.. నిజమేనా, కాదా?' అంటూ సభలోని వారిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఏదిఏమైనా పాలేరు నుంచే తానే పోటీ చేసి విజయం సాధిస్తానని తెలిపారు. 'ప్రజలకు మేలు చేస్తున్నాననుకుంటే నన్ను గెలిపించాలి, ఇంకా ఎవరైనా మేలు చేస్తారనుకుంటే వారినే గెలిపించండి' అంటూ వ్యాఖ్యానించారు. కాగా, శుక్రవారం కూసుమంచిలో సీపీఎం చేపట్టిన జనచైతన్య యాత్రలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరు స్థానం తమకు ప్రాధాన్యమైనదని చెప్పగా.. ఆ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే మరుసటి రోజే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

ఏర్పాట్లు ముమ్మరం

రామాలయంలో ఊపందుకున్న నవమి పనులు

- లడ్డూల తయారీ, తలంబ్రాల ప్యాకింగ్ పనులు ప్రారంభం
- పట్టాభిషేకానికి గవర్నర్ తమిళి సై పర్యటన ఖరారు ?
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ అనుదీప్, ఈఓ రమాదేవి



ముత్యాల తలంబ్రాలను యంత్రం ద్వారా ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మరో నాలుగు రోజుల్లో శ్రీ సీతారాముల కల్యాణం, ఆ తెల్లవారి పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం వేడుకలు జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లు జోరందుకున్నాయి. మిథిలా స్టేడియంలో షామియానాలు, చలువ పందిళ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. దేవస్థానానికి పూర్తిస్థాయిలో విద్యుదీకరణ పనులు పూర్తి కావచ్చాయి. నవమి ఏర్పాట్ల పనులను భద్రాద్రి జిల్లా కలెక్టర్ అనుదీప్, ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శనివారం పరిశీలించారు.

రెండు లక్షల లడ్డూలు..

శ్రీరామనవమికి వచ్చే భక్తుల కోసం రెండు లక్షల లడ్డూలు తయారు చేయాలని అధికారులు భావిస్తున్నారు. తానీషా కల్యాణ మండపంలో లడ్డూల తయారీ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. దేవస్థాన సిబ్బందితో పాటు విజయవాడ నుంచి వచ్చిన కార్మికులు లడ్డూలు సిద్ధం చేస్తున్నారు. ఏపీ, తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సంస్థల సభ్యులు తలంబ్రాలు తయారు చేస్తున్నారు. దాతలు సమకూర్చిన యంత్రాలతో ఈ ఏడాది తొలిసారిగా ముత్యాల తలంబ్రాలను ప్యాకింగ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న శ్రీరామాయణ క్రతువు

పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం సందర్భంగా ఈనెల 22న ప్రారంభించిన శ్రీరామాయణ క్రతువు యాగశాలలో నిర్విఘ్నంగా కొనసాగుతోంది. రుత్విక్‌లు చతుర్వేద హవనాలతో పాటు రామాయణ హవనం చేస్తుండగా, మరో పక్కన వేద పండితులు రామషడాక్షరీ, నారాయణ అష్టాక్షరి మంత్రాలను జపిస్తున్నారు. అనంతరం రుత్విక్‌లు సంక్షేప రామాయణ సామూహిక పారాయణం చేపట్టారు.

31న రానున్న తమిళి సై



ప్రతి ఏడాది శ్రీరామ నవమి తెల్లవారి జరిగే పట్టాభిషేక మహోత్సవానికి గవర్నర్ హాజరు కావటం పరిపాటి. కాగా, ఈనెల 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పర్యటన ఖరారైనట్లు సమాచారం. పట్టాభిషేకం అనంతరం దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల క్షేత్రాన్ని సైతం గవర్నర్ దర్శించనున్నారని విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులకు రాజ్‌భవన్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. ఇక శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి ఈ ఏడాదైనా సీఎం కేసీఆర్ హాజరవుతారా లేదా అనే విషయమై ఇప్పటివరకు స్పష్టత రాలేదు. జిల్లా, ఆలయ అధికారులు మాత్రం సీఎం పర్యటనకు తగినట్టుగానే ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రజాస్వామ్య పరిరక్షణ అందరి బాధ్యత



సదస్సులో పాల్గొన్న ప్రజాతంత్రవాదులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రస్తుత సమాజంలో రాజకీయ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న నేపథ్యాన పరిరక్షణ కోసం ప్రజలే నడుం బిగించాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి సూచించారు. ఖమ్మంలో 'వెంటిలేటర్‌పై ప్రజాస్వామ్యం' అంశంపై ఏర్పాటుచేసిన ప్రజాతంత్ర వాదుల సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలైన వ్యవస్థలు పాలకుల జేబు సంస్థల్లా మారాయని విమర్శించారు. ఈమేరకు పాలకులకు ఓటుతో బుద్ధి చెప్పాల్సిన అంశంపై ప్రజలను చైతన్యపర్చాల్సిన బాధ్యత ప్రజాతంత్రవాదులపై ఉందని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ములక సురేష్ అధ్యక్షత వహించగా సుప్రీంకోర్టు న్యాయవాది నిరూప్ కరణాకర్ దేశాయ్, ఆనంచిన్ని వెంకటేశ్వర్లు, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ కే.వీ.కృష్ణారావు, గుంతేటి వీరభద్రం, సుంకరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అగ్గి తెగులు నివారణ



రైతులకు సూచనలు ఇస్తున్న డీఏఓ విజయనిర్మల

ఏన్కూరు: వరి పంటను ఆశిస్తున్న అగ్గి తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల సూచించారు. మండలంలోని మూలపోచారం, రాంగనగర్ తండా, తిమ్మారావుపేట గ్రామాల్లో వరి పంటను శనివారం ఆమె పరిశీలించారు. అనంతరం డీఏఓ మాట్లాడుతూ అగ్గి తెగులు నివారణకు ట్రైక్లోజోల్ 0.6 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని, నత్రజని ఎరువు తగిన మోతాదులోనే వాడాలని తెలిపారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉన్నందున నీటి ఎద్దడికి గురి కాకుండా చూడాలని చెప్పారు. ఏడీఏ వి.బాబురావు, ఏఓ నర్సింహారావు, ఏఈఓలు బాలకృష్ణ, రవి పాల్గొన్నారు.

ఎస్‌బీ సీఐగా సర్వయ్య

ఖమ్మంక్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ సీఐగా సర్వయ్యను నియమిస్తూ ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం త్రీటౌన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న సర్వయ్యను ఇటీవల ఐజీకి అటాచ్ చేసిన విషయం విదితమే. తాజాగా ఆయనకు పోస్టింగ్ కల్పించారు.

బీఎస్‌ఎన్‌ఎల్‌కు మద్దతుగా నిలవాలి

ఖమ్మంమయూరిసెంటర్: బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు పొందుతున్న వినియోగదారులు సంస్థకు మద్దతుగా నిలవాలని జనరల్ మేనేజర్ పి.వెంకటేశం ఒక ప్రకటనలో కోరారు. మార్చి బిల్లులు ఇప్పటికే పోస్టాఫీస్‌కు పంపించామని, ఎవరికైనా బిల్లులు రాకపోతే కస్టమర్ సర్వీస్ సెంటర్ల నుంచి మరో కాపీ తీసుకోవచ్చని తెలిపారు. కాగా, ఈనెల 26, 30వ తేదీల్లో కూడా కస్టమర్ సేవా కేంద్రాలు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు.

సామగ్రి, నగదు చోరీ

సత్తుపల్లిటౌన్: స్థానిక కొత్తకొమ్మేపల్లి కాలనీలోని బడ్డీ కొట్టులో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన చేపలమడుగు నాగరత్నం శుక్రవారం రాత్రి బడ్డీకొట్టుకు తాళం వేసి ఇంటికి వెళ్లింది. శనివారం ఉదయం వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. దీంతో పరిశీలించగా రూ.15వేల విలువైన సామాగ్రి, రూ.5వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించి సమాచారం ఇవ్వగా పోలీసులు పరిశీలించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురిపై కేసు

తల్లాడ: మండలంలోని నారాయణపురంలో వరకట్నం వేధింపులు భరించలేక పొట్టేటి శ్రావ్య ఆత్మహత్య చేసుకోగా, కారకులైన నలుగురిపై తల్లాడ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.... శ్రావ్యకు మూడేళ్ల క్రితం వి.పవన్ కృష్ణారెడ్డితో వివాహమైంది. వివాహమైన దగ్గర నుంచి వరకట్నం కోసం ఆయన వేధిస్తున్నాడు. దీంతో వేధింపులు భరించలేక ఆమె శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకోగా.. భర్త పవన్ కృష్ణారెడ్డి, మామ శివనాగిరెడ్డి, అత్త కుమారి, ఆడబిడ్డ ఆళ్ల లక్ష్మీప్రసన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఖమ్మం వాసి మృతి

ఖమ్మంక్రైం: సూర్యాపేటలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మంకు చెందిన యువకుడు మృతి చెందాడు. నగరంలోని మోతీనగర్‌కు చెందిన గొరిశెట్టి వినయ్(21) శుక్రవారం రాత్రి ఖమ్మం నుండి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రాత్రి 11గంటల సమయాన సూర్యాపేట సమీపంలో చెవ్వెంల పోలీస్‌స్టేషన్ వద్దకు రాగానే రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన వినయ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

వేడుకల వేళ విషాదం



ఉదయ్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, బంధువులు

- అప్పటి వరకు సరదాగా స్నేహితుడి పుట్టినరోజు
- ఆపై బిర్యానీ కోసం ఖమ్మం వెళ్తుండగా ప్రమాదం
- ఇద్దరు యువకుల మృతితో మేడేపల్లిలో విషాదఛాయలు

ముదిగొండ: ముగ్గురి నడుమచిన్నప్పడే మొదలైన స్నేహం కొనసాగుతుండగా ఎక్కడికైనా కలిసే వెళ్లివచ్చేవారు. ఇందులో ఓ స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. రాత్రి పొద్దుపోయాక బిర్యానీ తినాలని అనిపించడంతో బైక్‌పై బయలుదేరారు. ఈక్రమంలో బైక్‌పై వేగంగా వెళ్తున్నట్లు తెలుస్తుండగా అదుపు తప్పడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరగగా, శనివారం ఉదయం ఖమ్మం ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం అనంతరం మేడేపల్లికి మృతదేహాలను తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఎప్పుడు కలిసి కనిపించే ముగ్గురిలో ఇద్దరు మృతి చెందడం, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఇద్దరు డిగ్రీ.. ఒకరు స్నేహితుడు

ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన పోతునూక శివ రామకృష్ణ (21), పగిళ్ల ఉదయ్‌కుమార్(21) డిగ్రీ ద్వితీయ సంవత్సరం ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలలో చదువుతున్నారు. వీరి స్నేహితుడు అదే గ్రామానికి చెందిన పొలగాని రవీందర్ పుట్టిన రోజు సందర్భంగా ముగ్గురు శుక్రవారం సాయంత్రం ఊరి చివరి సాగర్ కాల్వ బ్రిడ్జి కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే గడిపిన వీరు బిర్యానీ తినాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో రవీందర్ బైక్‌పై ఉదయ్‌కుమార్, శివరామకృష్ణతో కలిసి ఖమ్మం బయలుదేరారు. ఈక్రమంలో వీరు వేగంగా వెళ్తున్నట్లు తెలియగా.. ఖమ్మంలోని చర్చి కాంపౌండ్ బ్రిడ్జిపై అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఉదయ్, శివరామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, రవీందర్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు.



ఉదయ్‌కుమార్, శివరామకృష్ణ (ఫైల్)

పేద కుటుంబాలు...

శివరామృష్ణ తండ్రి పోతునూక నాగేశ్వరరావు ఆర్టీసీలో, ఉదయ్ తండ్రి మురళి మేడేపల్లిలో ట్రాక్టర్ డైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరివి పేద కుటుంబాలే కావడం, చేతికి వస్తున్నారనుకుంటున్న కొడుకులు కన్నుమూయడంతో తల్లిదండ్రులు రోదనలకు అంతు లేకుండా పోయింది. ఇక ఉదయ్, శివరామకృష్ణ అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించగా బంధువులు, స్నేహితులు వందలాదిగా చేరుకుని నివాళులర్పించారు. అందరితో కలిసిమెలిసి ఉండే వీరి మృతదేహాలను చూసిన స్నేహితులు సైతం కంటతడి పెట్టారు. కాగా, శివరామకృష్ణకు తల్లిదండ్రులతో పాటు ఓ సోదరి ఉండగా, ఉదయ్‌కు తల్లిదండ్రులు, ఓ సోదరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఖమ్మంక్రైం : ఖమ్మం చర్చి కాంపౌండ్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ముదిగొండ మండలం మేడేపల్లికి చెందిన యువకులు శివరామకృష్ణ, పగిళ్ల ఉదయ్ మృతి చెందగా, రవీందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఘటనపై శివరామకృష్ణ తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసశామని సీఐ చిట్టిబాబు తెలిపారు.

చెప్పే బయటకు వెళ్లేవాడు..

నా కొడుకు ఏ నాడు చెప్పకుండా బయటకు వెళ్లేవాడు కాదు. ఎక్కడికైనా చెప్పేవాడు. శివతో పాటు ఆయన అక్కడ మాకు అండగా ఉంటామని చెప్పేవారు. ఒక్కగానొక్క కొడుకు కావడంతో అల్లారు ముద్దుగా పెంచుకున్నాం. ఇప్పుడు ఈ ఘోరం జరిగిపోయింది. – పుష్పవతి, శివరామకృష్ణ తల్లి

మాకెవరు దిక్కు..

డిగ్రీ చదువుతున్న నా కొడుకు కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటాడని అనుకున్నాం. కానీ అసలే లేకుండా పోయాడు. ఇప్పుడు మాకెవరు దిక్కు. ట్రాక్టర్ డ్రైవర్‌గా నేను ఎక్కడ ఉన్నా ప్రతిరోజు వచ్చి మాట్లాడి వెళ్లేవాడు. ఇప్పుడు నా కొడుకు మాటలే కరువయ్యాయి. – పగిళ్ల మురళి, ఉదయ్ తండ్రి

పల్లెప్రగతిలో జిల్లా ముందంజ



సన్మానం అందుకున్న సర్పంచ్‌లు, కార్యదర్శులతో మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్ తదితరులు

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులు, సన్మానం

ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలకు అవార్డులు ఇస్తుండగా 20 అవార్డులకు 19అవార్డులు రాష్ట్రానికే దక్కడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. జిల్లా స్థాయిలో జాతీయ ఉత్తమ పంచాయతీ అవార్డులు సాధించిన గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులను కలెక్టరేట్‌లో శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెంది రూపురేఖలు మారాయని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే రాష్ట్రం, ఖమ్మం జిల్లాకు అత్యధిక అవార్డులు వచ్చాయని చెప్పారు. రేఅనంతరం జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడగా డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పురస్కారం

రాష్ట్ర ప్రభుత్వం పల్లెలకు ప్రాధాన్యతనిస్తూ నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతుంది. గతంలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోనే చెత్త తరలింపు ఉండగా... పల్లెల్లోనూ అమలుచేస్తూ స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ప్రారంభించింది. హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, సీసీ రోడ్ల నిర్మాణం ఇలా అనేక కార్యక్రమాలు చేపడుతుండగా, కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలు అందిస్తోంది. ఈమేరకు జిల్లా స్థాయిలో 27 జీపీలను ఉత్తమ పంచాయతీలుగా జిల్లా కమిటీ ఎంపిక చేయగా.. సర్పంచ్, కార్యదర్శులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అవార్డులు అందజేసి సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిది అంశాల ప్రాతిపదికన జాతీయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యకర పంచాయతీ, బాలల స్నేహపూర్వక, నీటి సమృద్ధి, పచ్చదనం – పరిశుభ్రత, స్వయం సమృద్ధి, మౌలిక వసతులు, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక పంచాయతీ తదితర అంశాల ఆధారంగా ఉత్తమ జీపీలకు ఎంపిక చేశారు.

ఆదరణ ఓర్వలేకే రాహుల్‌పై వేటు

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఇటీవల చేపట్టిన యాత్రతో ఆదరణ పెరుగుతుండడంతో ఓర్వలేక ఆయనపై అనర్హత వేటు వేశారని కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ ఆరోపించారు. ఈమేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు నగరంలో నిరసన తెలిపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను దేశ ప్రజలను గమనిస్తున్నారన్నారు. ఎన్ని అక్రమకేసులు బనాయించినా భయపడే ప్రసక్తే లేదని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు మద్ది వీరారెడ్డి, బొందయ్య, రవికుమార్, వెంకటేశ్వర్లు, భారతిచంద్రం, సయ్యద్ గౌస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే, కూసుమంచిలో కూడా కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యాన ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు.



మోడీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్యూనిస్టులు ఉన్న వైపే విజయాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- సంఘీభావం తెలిపిన ఎంపీ నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు, పక్కన తమ్మినేని వీరభద్రం

నేలకొండపల్లి: కమ్యూనిస్టులు ఏ పక్షాన ఉంటే వారే గెలుస్తారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన జన చైతన్య యాత్ర శనివారం నేలకొండపల్లికి చేరగా సభలో ఆయన మాట్లాడారు. మునుగోడు విజయం కమ్యూనిస్టులదేనని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కూడా అంటున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పాలేరుతో పాటు అనేక నియోజకవర్గాలను ప్రాధాన్యతగా పెట్టుకున్నామని తెలిపారు. కాగా, సమర్థించే వాళ్లను సహించే పరిస్థితి ప్రధాని మోడీకి లేదని ఆరోపించారు. బీజేపీ మళ్లీ గెలిస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని, లౌకికతత్వం కనుమరుగవుతుందని ఆయన తెలిపారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై భయంతోనే బీజేపీ నేతలు సస్పెన్షన్ విధించారని ఆరోపించారు. రాష్ట్రంలో పేపర్ల లీకేజీ విషయంలో దోషులను గుర్తించాలని కోరుతున్నట్లు తమ్మినేని తెలిపారు.

బీజేపీని తరిమికొట్టాలి : ఎంపీ నామా

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీని తరిమికొట్టాలని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యాత్రకు సంఘీభావం తెలిపిన ఆయన మాట్లాడుతూ బీజేపీని గద్దె దింపకపోతే దేశానికి పెనుముప్పు ఎదురవుతుందని తెలిపారు. రైతు బంధు జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, ఎంపీపీ రమ్య తదితరులు కూడా సంఘీబావం తెలిపారు. సీపీఎం నాయకులు జూలకంటి రంగారెడ్డి, నున్నా నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, రామారావు, జి.నాగేశ్వరరావు, సిరికొండ ఉమామహేశ్వరి, బి.లక్ష్మి, యలమద్ది లెనిన్, యడ్ల తిరపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్సైలకు స్థానచలనం

మధిర: మధిర రూరల్ ఎస్సై నరేష్‌ను ముదిగొండ పోలీస్‌స్టేషన్‌కు తాత్కాలికంగా అటాచ్ చేశారు. అలాగే, ముదిగొండ ఎస్సై టి.నాగరాజును ఖమ్మం టు టౌన్‌కు, అక్కడి ఎస్సై కె.శ్రీధర్‌ను మధిర రూరల్ కు కేటాయిస్తూ శనివారం సీపీ వారియర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కుక్క దాడిలో గాయాలు

మధిర: మున్సిపాలిటీ పరిధి అంబేద్కర్ సెంటర్‌లో బాలుడు చటారి మనోజ్‌పై శుక్రవారం రాత్రి కుక్క దాడి చేయగా గాయాలయ్యాయి. దళిత కాలనీకి చెందిన మనోజ్ షాపు వద్దకు వెళ్తుండగా కుక్క దాడి చేయడంతో కుటుంబీకులు మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ సెల్‌లో ఐబీఎం ఇండియా అందించిన రూ.3.9లక్షల నిధులతో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ జి.పద్మావతి వివరాలు వెల్లడించారు. అధ్యాపకులు, సిబ్బంది శ్రీనివాసరావు, తిరుమలాదేవి, కృష్ణవేణి, కృష్ణకుమారి, ట్రస్ట్ బాధ్యులు నవీన్ పాల్గొన్నారు.

ఐఆర్‌సీఎస్ ఛైర్మన్‌గా వెలిగేటి



రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గం

ఖమ్మం మామిళ్లగూడెం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ఎన్నికయ్యారు. తాజాగా నిర్వహించిన ఎన్నికల్లో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, శనివారం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈమేరకు చైర్మన్‌గా చంద్రమోహన్‌తో పాటు వైస్ చైర్మన్‌గా ఆర్.రవీందర్‌రావు, కోశాధికారిగా ఎ.గోవర్దన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసమావేశంలో సభ్యులు సాదినేని జనార్దన్ రావు, డాక్టర్ విజయలక్ష్మి, కొత్తా సత్యనారాయణరెడ్డి, గజేంద్రుల నాగేశ్వరావు, తాతా రాఘవయ్య, జిల్లా వెంకటేశ్వర్లు, సూర్యప్రకాశరావు, ఎస్.కే.ముజీబ్, డాక్టర్ బిబాలు, గుడ్ల వీరభద్రరావు, జెల్లా లక్ష్మీనారాయణ, మూలగుండ్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాష వినియోగం పెరగాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: వివిధ రాష్ట్రాల్లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో హిందీ భాషను మరింత ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరముందని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వెంకటనారాయణ అన్నారు. ఖమ్మంలో శనివా రం నిర్వహించిన నగర అధికారిక భాష అమలు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తర, ప్రత్యుత్తరాలను హిందీలో అమలు చేయాలని సూచించారు. ఎస్‌బీఐ ఏజీఎం వెంకటనారాయణ, చీఫ్ మేనేజర్ ప్రసన్నకుమార్, యూనియన్ బ్యాంక్ డీజీఎం పార్థసారధి మురళి, కేంద్ర హోంశాఖ అధికారి నరేంద్ర సింగ్ మెహ్రా, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ బాధ్యత పాలకులదే..



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీల పరిరక్షణను పాలకులు బాధ్యతగా స్వీకరించాలని కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఖమ్మంలోని మంచి కంటి హాల్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన శనివారం ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. ఆర్టీసీల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా నిరసనలు తెలపనున్నట్లు పేర్కొన్నారు. కాగా, కార్మికులకు 2017, 2021నాటి వేతన ఒప్పంద బకాయిలు, డీఏ, ఏరియర్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు లింగమూర్తి, కల్యాణం వెంకటేశ్వరావు, తోకల బాబు, గుండు మాధవరావు, నరసింహారావు, బుడిగం శ్రీను, బుగ్గవీటి లింగమూర్తి పాల్గొన్నారు.

1వ తేదీనే పింఛన్లు ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ఖమ్మం సహకారనగర్: ప్రతి నెల 1వ తేదీనే పెన్షన్లు ఇవ్వాలనే డిమాండ్‌తో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసిరెడ్డి మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణం నాగేశ్వరరావు మాట్లాడుతూ పింఛన్ చెల్లింపుల్లో జాప్యం చేయొద్దని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు అనుమతించేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆ తర్వాత కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు టీ.ఎస్.రావు, గణపతి, రాములమ్మ, వీరబాబు, శ్రీధర్, మాధవరావు, వీరయ్య, రామయ్య, ఉపేంద్ర, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యం తాళలేక ఆత్మహత్య

కారేపల్లి: కేన్సర్ బాధపడుతుండగా, ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కారేపల్లి గ్రామానికి చెందిన నర్సింగ్ ఉమామహేశ్వర రావు(54) కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స అనంతరం హైదరాబాద్ నుంచి శనివారం కారేపల్లికి వచ్చిన ఆయన సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుష్పాల రామారావు తెలిపారు. కాగా, ఉమామహేశ్వరరావు 30ఏళ్లుగా సీపీఎంలో క్రియాశీలకంగా పనిచేసి 'సీపీఎం ఉమ'గా గుర్తింపు సాధించాడు. ఆయనకు భార్య నాగేంద్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చోరీకి యత్నిస్తుండగా పట్టుకున్న గ్రామస్తులు

నేలకొండపల్లి: పట్టపగలే ఇంట్లోకి చొరబడి చోరీ చేసి పారిపోతున్న వ్యక్తులు స్థానికులు బంధించి పోలీసులకు అప్పగించారు. మండలంలోని పైనంపల్లికి చెందిన షేక్ మదార్‌బీ శనివారం హోటల్ నుంచి వచ్చి ఇంట్లో నిద్రిస్తోంది. ఈ సమయాన మాలధారణలో ఉన్నట్లుగా దుస్తులు ధరించిన దొంగ ఇంట్లోకి చొరబడ్డాడు. రంజాన్ పండుగ కోసం దాచుకున్న డబ్బును దొంగిలించే క్రమంలో శబ్దం రావడంతో మేల్కొన్న మదార్‌బీ కేకలు వేయడంతో నిందితుడు పరుగులు తీశాడు. దీంతో స్థానికులు వెంబడించి ఆయనను పట్టుకుని పోలీసులకు తెలపగా వారు అదుపులోకి తీసుకున్నారు. తొలుత రామచంద్రాపురంలో సదరు వ్యక్తి చోరీకి యత్నించగా స్థానికులు పట్టుకున్నారని, అక్కడి నుంచి పైనంపల్లికి వచ్చినట్లు తెలిసింది.